ప్రజాశక్తి

ఆదివారం 16 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





అంచనాలకు మించి పెట్టుబడులు

- రూ.13.25 లక్షల కోట్లుగా పేర్కొన్న ప్రభుత్వం
- 16 లక్షల పైచిలుకు ఉద్యోగాలు.. 613 ఎంఒయులు
- ముగిసిన సిఐఐ సమ్మిట్



సిఐఐ భాగస్వామ్య సదస్సు వేదికపై కంపెనీల ప్రతినిధులతో సిఎం చంద్రబాబు



సమ్మిట్‌కు వస్తున్న మహిళా ప్రతినిధులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో తలపెట్టిన సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అంచనాలకు మించిన స్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. 613 ఎంఒయులు జరిగాయి. అదే స్థాయిలో ఉద్యోగాల కల్పనపై కంపెనీల నుంచి హామీలు వచ్చాయి. రెండు రోజుల పాటు తలపెట్టిన సిఐఐ 30వ భాగస్వామ్య సదస్సుకు భారీగా పారిశ్రామికవేత్తలు తరలివచ్చారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు వారు ముందుకు రావడంతో ఒక రోజు ముందుగానే ఎంఒయులు కుదుర్చుకునే కార్యక్రమం ఆరంభమైంది. మొత్తంగా చూసినప్పుడు మూడు రోజుల పాటు కుదుర్చుకున్న ఒప్పందాల విలువ రూ.13,25,716 కోట్లుగా ఉంది. వీటి ద్వారా 16,31,188 ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం చెబుతోంది. వాస్తవానికి రెండు రోజుల్లో సుమారుగా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తే అంతకు మించి వచ్చినట్టు సర్కారు వెల్లడించింది. అంచనాలకు మించి 30 శాతం అదనంగా పెట్టుబడులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

ఈ సదస్సుకు ముందుగానే సిఎం చంద్రబాబు సింగపూర్, యుఎఇ, లండన్ వంటి దేశాల్లో పర్యటించారు. అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. దీంతో భాగస్వామ్య సదస్సు నిర్వహించిన రెండు రోజుల్లో భారీగా పెట్టుబడులు వచ్చేలా ఉన్నాయని ప్రభుత్వం కూడా అంచనా వేసింది. అందుకు తగ్గట్టుగానే సదస్సు నడిచింది. మూడు రోజుల పాటు జరిగిన ఒప్పందాల్లో సగానికి పైగా ముఖ్యమంత్రి సమక్షంలోనే జరిగాయి. ఆయనే నేరుగా రూ.7,63,210 కోట్ల పెట్టుబడులకు ఎంఒయులు కుదుర్చుకున్నారు. ఇక ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖలకు చెందిన మంత్రులు కూడా భారీ ఎత్తునే పెట్టుబడులపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మొత్తంగా మంత్రులందరూ కలిసి 490 ఎంఒయుల ద్వారా రూ. 5,62,506 కోట్ల మేర పెట్టుబడులు కుదుర్చుకున్నారు.

12 రంగాలు.. రూ. 13 లక్షల కోట్లు

అటు ముఖ్యమంత్రి.. ఇటు మంత్రులంతా కలిసి చేసుకున్న ఒప్పందాల ద్వారా 12 రంగాల్లో పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడుల్లో టాప్-3లో ఇంధన, పరిశ్రమలు, మౌలిక వసతుల రంగాలు నిలిచాయి. మొత్తంగా రూ.13.25 లక్షల కోట్ల మేర పెట్టుబడుల్లో అధిక భాగం ఇంధన రంగానికి వచ్చాయి. ఈ రంగంలో రూ.5,33,351 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తర్వాత పరిశ్రమల రంగానికి మిగతా 2లో..



భారీగా ఎగిసి పడుతున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం

భయభ్రాంతులకు గురైన ప్రజలు

వార్త మెయిన్‌లో..



స్త్రీ శక్తిలో విశాఖ ప్రథమ స్థానం



ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహిళలకు ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం అమలులో విశాఖపట్నం ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ తెలిపారు. శనివారం విశాఖపట్నం కాంప్లెక్స్‌ను మంత్రి సందర్శించారు. ముందుగా మహిళా ప్రయాణికులను స్త్రీ శక్తి పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బస్సుల సమయ పాలన, సౌకర్యాల గురించి ప్రయాణికులను అడిగి కాంప్లెక్స్‌లో ఉన్న అద్దె షాపులను తనిఖీ చేశారు. ఎమ్మార్పి ధరలకు మాత్రమే వస్తువులను విక్రయించాలని ఆదేశించారు. డెంటల్ డాక్టర్ సంతోష్ రూ.3 లక్షల20 వేల విలువైన 1620 ప్రథమ చికిత్స కిట్‌లను అందించగా వాటిని విజయనగరం జోన్లో గల అన్ని బస్సులకు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. డాక్టర్ సంతోష్‌ను సత్కరించి అభినందించారు. అనంతరం ఆర్టిసి పూర్వపు విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 627 మంది అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వటానికి ప్రక్రియను వేగవంతం చేయాలని, జిల్లా ప్రజా రవాణాఅధికారి అప్పలనాయుడును ఆదేశించారు. 37 మంది అసిస్టెంట్ డిపో క్లర్క్స్, కంట్రోలర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులకు సంబంధించి పత్రాలను మంత్రి అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు టిహెచ్‌ఎస్ సౌకర్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. మహిళల ఉచిత ప్రయాణ చార్జీల నిమిత్తం 75 రోజులకు గాను రూ.400 కోట్లు ఆర్‌టిసికి తిరిగిచెల్లించేందుకు మిగతా 2లో..

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. శనివారం విశాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న న్యాయ మూర్తులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యుడిషియల్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తూ, పెండింగ్‌లో ఉన్న కాంపౌండబుల్ కేసులు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ కేసులు, మోటార్ అక్సిడెంట్ క్లెయిమ్స్, ఫ్యామిలీకోర్టు విషయాలు, సివిల్, క్రిమినల్ కేసులను గుర్తించి, ఇరు పక్షాలకు మిగతా 2లో..

ఘనంగా విసిసి బాలల దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. నగరంలో 50 ప్రాంతాలలో బాలలకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ, విశ్వ మానవ సంక్షేమ సంఘం, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం సంస్థలు సర్టిఫికెట్లు, బహుమతులు కోసం సహకారాన్ని అందించాయి. ఈ పోటీలు నివాస ప్రాంతాలలో ఉండే పిల్లలకు క్లబ్స్ ద్వారా, ట్యూషన్ సెంటర్స్‌లో నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీలలో పోటీలు నిర్వహించారు. ఒక్కొక్క కేటగిరీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు ఇవ్వడంతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జగదాంబ ప్రాంతం పరిధిలో ఉన్న పది ఏరియాలలో పిల్లలందరికీ బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది. పిల్లలు, పెద్దలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం అధ్యక్షురాలు దీపా జెలోకా, ఉపాధ్యక్షురాలు సునీత కుమార్, పిడిసి కస్తూరి రెడ్డి, జాయింట్ సెక్రటరీ విభా అగర్వాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అదే విధంగా మద్దిలపాలెం, గాజువాక, మల్కాపురం ప్రాంతాలలో కూడా బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమాలలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ, సెక్రటరీ సాయి తేజ, కో-ఆర్డినేటర్ పి.సతీష్, జగదాంబ జోన్ కన్వీనర్ పి.సరోజినీదేవి, జి.భారతి, మణి, మురళి, బి.అప్పారావు, విజయలక్ష్మి, నందిని పాల్గొన్నారు.



అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులు

మొదటి పేజీ తరువాయి..

అంచనాలకు మించి పెట్టుబడులు

రూ.2,80,384 కోట్లు, మౌలిక వసతుల రంగానికి రూ.2,01,758 కోట్లు వచ్చాయి. ఇక ఉద్యోగాల కల్పనకు సంబంధించి టాప్-3లో పరిశ్రమలు, మౌలిక వసతులు, ఐటిఇ అండ్ సి రంగాలున్నాయి.

రంగాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు

విద్యుత్ రంగం - రూ. 5,33,351 కోట్ల పెట్టుబడులు - 2,66,722 ఉద్యోగాలు
పరిశ్రమలు - రూ.2,80,384 కోట్ల పెట్టుబడులు - 5,19,083 ఉద్యోగాలు
మౌలి వసతులు - రూ. 2,01,758 కోట్ల పెట్టుబడులు - 3,06,649 ఉద్యోగాలు
ఐటిఇ అండ్ సి - రూ. 1,59,467 కోట్ల పెట్టుబడులు - 2,96,315 ఉద్యోగాలు
ఏపి సిఆర్‌డిఎ - రూ.48,711 కోట్ల పెట్టుబడులు - 41,625 ఉద్యోగాలు
టూరిజం - రూ. 21,036 కోట్ల పెట్టుబడులు -1,05,804 ఉద్యోగాలు
ఫుడ్ ప్రాసెసింగ్ - రూ.13,008 కోట్ల పెట్టుబడులు - 47,390 ఉద్యోగాలు
పట్టణాభివృద్ధి - రూ.4,944 కోట్ల పెట్టుబడులు - 12,150 ఉద్యోగాలు
టెక్స్‌టైల్స్ - రూ.4,490 కోట్ల పెట్టుబడులు - 8,450 ఉద్యోగాలు
వైద్యారోగ్యం - 4,208 కోట్ల పెట్టుబడులు - 24000 మందికి ఉద్యోగాలు
విద్యా రంగం - రూ.4,359 కోట్ల పెట్టుబడులు - 3,000 మందికి ఉద్యోగాలు
ఇతర శాఖలు - రూ. 50,000 కోట్ల పెట్టుబడులు

గోద్రెజ్ అగ్రోవెట్ రూ.70 కోట్ల పెట్టుబడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలోని అతిపెద్ద డైవర్సిఫైడ్ అగ్రి ఫుడ్ వ్యాపార సంస్థలలో ఒకటైన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కీలకమైన ఎంఒయుపై సంతకం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం ద్వారా ఆ కంపెనీ రాష్ట్రంలో రూ.70 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందం ద్వారా డెయిరీ వ్యాపారం విస్తరణ సాగనుంది. గోద్రెజ్ అగ్రోవెట్ తన డెయిరీ ప్రాసెసింగ్ సామర్థ్యాలను గణనీయంగా విస్తరించనుంది. ఈ సందర్భంగా గోద్రెజ్ అగ్రోవెట్ ఎమ్‌డి సునీల్ కటారియా, గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాల గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి మాట్లాడుతూ వ్యవసాయ ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని బలోపేతం చేయడం తమ లక్ష్యమన్నారు.

స్త్రీ శక్తిలో విశాఖ ప్రథమ స్థానం

ఈ నెల 13న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో ఏపిఎస్ ఆర్టిసిజోన్-1, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

నోటీసులు జారీ చేయాలన్నారు. గరిష్ట సెటిల్మెంట్లు సాధించాలని, ఈ లోక్‌అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు వంటి వాటిని వేగంగా పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, విశాఖపట్నం కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విశాఖ పోర్టును సందర్శించిన విదేశీ బృందాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: నేపాల్, రష్యా నుంచి వచ్చిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం శనివారం విశాఖపోర్టును సందర్శించారు. నేపాల్ ప్రతినిధి బృందానికి నేపాల్ పరిశ్రమ, వాణిజ్య సరఫరాల మంత్రి, అనిల్ కుమార్ సిన్హా నాయకత్వం వహించారు. ఆయనతో పాటు బిపిన్ ఆచార్య, జాయింట్ సెక్రటరీ, పరిశ్రమ, వాణిజ్య సరఫరాల మంత్రిత్వశాఖ, తరకరాజ్ భట్ట, అండర్ సెక్రటరీ, పరిశ్రమ, వాణిజ్యం సరఫరాల మంత్రిత్వ శాఖ ఉన్నారు. రష్యా నుండి వచ్చిన 11 మంది సభ్యుల ప్రతినిధి బృందం పోర్టును సందర్శించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అధికారులు ఇరువురికి స్వాగతం పలికారు. పోర్టులో అందుబాటులో ఉన్న ఆధునిక మౌలిక సదుపాయాలు, సరుకు రవాణా సామర్థ్యం ఆధునీకరణ పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే నీటి రీసైక్లింగ్ విధానాల గురించి వివరించారు. విశాఖపట్నం పోర్ట్ ద్వారా దిగుమతి ఎగుమతి కార్యకలాపాలను, వ్యాపార అభివృద్ధికి అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలు, పరస్పర సహకార మార్గాలపై చర్చలు జరిపారు.

28న క్యూట్ లవ్ స్టోరీ స్కూల్ లైఫ్ విడుదల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: స్మార్ట్‌ఫోన్లు లేని రోజుల్లో, పాఠశాల విద్యార్థుల మధ్య కలిగే తొలిప్రేమ ఎంత స్వచ్ఛంగా ఉండేదో తెలియజేసేదే 'స్కూల్ లైఫ్' చిత్రం అని, చిత్ర దర్శకుడు, హీరో పులివెందుల మహేష్ తెలిపారు. ఇదొక క్యూట్ లవ్ స్టోరీ అన్నారు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదల చేస్తున్నట్లు తెలిపారు. చిత్రానికి గంగాభవాని నిర్మాత, కథ, స్క్రీన్ ప్లే,దర్శకత్వం పులివెందుల మహేష్, సంగీతం ఎస్.కె బాజీ సమకూర్చారు.

జనసేన రాష్ట్ర నేత బొలిశెట్టికి సతీ వియోగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ పర్యావరణ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పారిశ్రామికవేత్త బొలిశెట్టి సత్యనారాయణ (సత్య) సతీమణి నాగమణి (60) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా అస్వస్థతగా ఉన్న ఆమెను చికిత్సకోసం హైదరాబాద్ తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమె పార్థివదేహాన్ని విశాఖ నగరంలోని ఎంవిపి కాలనీ సెక్టార్ -1 లో ఉన్న వారి గృహానికి తీసుకువచ్చారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం సాయంత్రం ఆమె మృతికి సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు.

కియా ఓనర్‌షిప్ క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కియా మోటార్స్ సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కియా ఓనర్‌షిప్ క్యాంపెయిన్‌ను శనివారం ఉదయం విశాఖలోని బిర్లా జంక్షన్ వద్ద ఉన్న లక్ష్మీ కియా సర్వీస్ సెంటర్‌లో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్‌సిహెచ్.శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించడం, అతివేగాన్ని నివారించడం వంటి రహదారి భద్రతా చర్యలను తప్పకుండా పాటించాలని తెలిపారు. అంతేకాకుండా వాహనదారులు ఎప్పటికప్పుడు చేయించే నిర్వహణ ప్రక్రియపై దృష్టి సారించాలని, కేవలం నిర్దిష్ట కాల వ్యవధిలో చేసే నిర్వహణతో సరిపెట్టవద్దని సూచించారు. ముఖ్యంగా విశాఖపట్నం ఉప్పు ప్రాంతం కావడంతో పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులను కోరారు. ఇదిలా ఉండగా ఈ ఓనర్‌షిప్ క్యాంపెయిన్‌లో భాగంగా కస్టమర్ల కోసం అనేక ఆకర్షణీయమైన ఆఫర్లను కియా ప్రకటించింది. ముఖ్యంగా 36 పాయింట్ల జనరల్ చెకప్‌తో పాటు ఇతర సర్వీసులపై డిస్కౌంట్లు అందించింది. ఈ ఆఫర్లు ఈ నెల 23 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని, విశాఖలోని మధురవాడ, బిర్లా జంక్షన్‌లోని లక్ష్మీ కియా సర్వీస్ సెంటర్‌లలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు.



ప్రారంభ కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు

కీలక మైలురాయిని చేరుకున్న ఎన్ఎస్ఇ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఇ) భారతీయ ఆర్థిక వ్యవస్థలో మరో కీలకమైన మైలురాయిని చేరుకుందని ఎన్ఎస్ఇ చీఫ్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీరామ్‌కృష్ణన్ తెలిపారు. శనివారం ఆయన ఎయులో సిఐఐ భాగస్వామ్య వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నవంబర్ 2025 నాటికి, ఎన్ఎస్ఇలో ప్రత్యేకమైన ట్రేడింగ్ ఖాతాల సంఖ్య ఏకంగా 24 కోట్లు (240 మిలియన్లు) దాటిందని, గత ఏడాది అక్టోబర్‌లో 20 కోట్ల మార్కును దాటిన తర్వాత కేవలం ఒక సంవత్సరంలోనే ఈ అద్భుతమైన వృద్ధి నమోదైందన్నారు. సెప్టెంబర్ 30, 2025 నాటికి, లిస్టెడ్ కంపెనీలలో వ్యక్తిగత పెట్టుబడిదారుల వాటా 18.75% కి చేరింది, ఇది గత 22 సంవత్సరాలలో గరిష్ట స్థాయి అని ఆయన అన్నారు.

ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
వచ్చే ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సిఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో రెండు రోజులపాటు నిర్వహించిన భాగస్వామ్య సదస్సు సూపర్‌హిట్ అయిందని పేర్కొన్నారు. జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. శనివారం ఎయు గ్రౌండ్‌లో తలపెట్టిన సమ్మిట్ ముగింపు వేడుకలో ఆయన మాట్లాడారు. 45 దేశాల్లో సమ్మిట్ చర్చనీయాంశమైందని, విశాఖ పేరు మార్మోగుతోందని తెలిపారు. మంత్రులు, అధికారుల కృషితోనే ఇది సాధ్యమైందని అన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఓపెన్ ఎగ్జిబిషన్

ఎంవిపి.కాలనీ : ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు హాల్ 2లో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ రంగాలలో అందిస్తున్న అపారమైన పెట్టుబడి అవకాశాలను అక్కడ ప్రదర్శించారు. పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ విధానాలపై వివరించారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు విష్ణుపురి కాలనీలో జివిఎంసి నిధులతో జరుగుతున్న సిసి రోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. సిసి రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం నాయకులు కొండల రాజు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయం కిటకిట

ప్రజాశక్తి- పద్మనాభం : కార్తీక మాసంలో వచ్చిన ఏకాదశి సందర్భంగా పద్మనాభంలోని శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది మునుపు ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఘాట్ రోడ్డు మార్గం సౌకర్యం ఉండటంతో భక్తుల రద్దీ పెరిగింది. రోజూ ఆలయానికి భక్తుల తాకిడి ఉందని అర్చకులు సీతారామ ఆంజనేయులు తెలిపారు. కొండ దిగువ ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలో కూడా భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ ఈవో నరసింహారాజు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమాల్లో ఎంపిపి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం



శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో 2008లో నిర్మించిన శాఖా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం ముందు భాగం పెచ్చులూడి ఉంది. సరిపడా ఫర్నిచర్ లేక పోవడంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారు. దాదాపు 10 వేల వరకు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో పోటీ పరీక్షలకు సంబంధించినవి, చరిత్ర కారుల, స్వాతంత్ర్య సమర యోధుల జీవిత విశేషాలకు సంబంధించినవి, నవలలు, కథల పుస్తకాలు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీషు దినపత్రికలు ఉండనే ఉన్నాయి. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి సాయంత్రం 7 గంటల వరకు గ్రంథాలయ పని చేస్తోంది. ఈ సమయాల్లో దాదాపు 70 మంది వరకు పాఠకులు వస్తున్నారు. పురపాలక సంఘంగా ఉన్న కాలంలో అప్పటి రాజ్యసభ సభ్యులు టి సుబ్బరామిరెడ్డి నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని గ్రంథాలయం నిర్వహణకు వినియోగిస్తున్నారు. గ్రంథాలయ భవనంపై అదనపు భవనం నిర్మాణానికి పురపాలక సంఘంగా ఉన్న సమయంలో ఏళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మున్సిపాలిటీ జివిఎంసిలో విలీనమై ఏళ్లు గడుస్తున్నా సరే గ్రంథాలయ భవనం మరమ్మతులకు, ఆధునీకరణకు, అదనపు సౌకర్యాల కల్పనకు నోచుకోలేదు. విజ్ఞాన భాండాగారాలుగా కీర్తించ బడుతున్న గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని విద్యాధికులు, మేధావులు కోరుతున్నారు.

నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాయుడు



సన్యాసినాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా టిడిపి సీనియర్ నాయకులు గాడు సన్యాసినాయుడును పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్థానిక పార్టీ నాయకులతో శనివారం కార్పొరేషన్ డైరెక్టర్ నాయుడు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను చిత్త శుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడును ఎమ్మెల్యే శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడు అప్పలనాయుడు, ఆనంద్ తదితరులు ఉన్నారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ జిల్లాలో శనివారం పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

పద్మనాభం : మండల పరిధి పాండ్రంగిలోని అల్లూరి సీతారామరాజు సామాజిక భవనం ప్రాంగణంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరంలో 80 మందికి వైద్యులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రామరాజు, బి.సత్యసాయి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రెస్ క్లబ్ ఆవరణలో మెడిసి హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 100 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు మెడిసి మేనేజర్ జి.రాంబాబు తెలిపారు. వారానికి ఒకసారి సుగరు, బిపి, 15 రోజులకొకసారి ఇసిజి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్.సంతోష్, సిహెచ్.దేవి, మాధవి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో రొయ్య ప్రశాంత్‌కుమార్, పల్ల శ్రీనివాస్, నాగులపల్లి రవికుమార్, వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు, మూర్తి, మరిశర్ల వెంకటరమణ, మావిడి రాజు, సూర్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : వేములవలసలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు ఆధ్వర్యంలో మధురవాడ నియో విజన్ కంటి ఆసుపత్రి నేతృత్వంలో ఉచింత కంటి, చర్మ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 40 మంది కంటి సమస్యలతో, 10 మంది చర్మ సంబంధిత సమస్యలతో పరీక్షలు చేయించుకున్నారు. ఆరుగురికి కంటి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. వారికి మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలోని నియో విజన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు బాలకృష్ణ, చర్మ వ్యాధుల డాక్టర్ సుహాసిని, క్యాంప్ మేనేజర్ పవన్‌కుమార్, ఆప్టొమెట్రిస్ట్ జ్ఞానేశ్వరి, స్కిన్ అసోసియేట్స్ లావణ్య, రజ్నీ, పడాల రమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్యూజె కళాశాల, మెడికవర్ హాస్పిటల్ సంయుక్తాధ్వర్యాన పాలవలస గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బిపి, సుగర్, గుండె సంబంధిత ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్యూజె కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తగరపువలస : చిప్పాడ దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో గుడివాడ, శ్రీరామ్‌నగర్, పాత చెరుకుపల్లి, ఎరుసుపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 62 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలిపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మనస్వి, ఆప్తమాలజిస్ట్ గణపతి నేత్ర పరీక్షలు చేశారు. 22 మందికి చుక్కల మందు, మల్టీ విటమిన్స్ మందులను దివీస్ సంస్థ ద్వారా ఉచితంగా అందజేశారు. 11మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కళ్లద్దాలు 15 రోజులలో ఏర్పాటుచేస్తామని దివిస్ సిఎస్ఆర్ అధికారి డి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సర్పంచ్ చిల్ల జమున, సిఎస్ఆర్ ప్రతినిధులు కె.నరసింహ, శేఖర్, పాల్గొన్నారు.

ములగాడ : డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ సౌజన్యంతో ప్రతిభ హైస్కూల్లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రిన్సిపల్ తోనంగి వెంకటరమణి సహకారంతో నిర్వహించారు. కంటి, దంత, సుగర్, బిపి తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకటరమణి మాట్లాడుతూ, ఎక్కువ పేద ప్రజలు ఉన్న ఈ ప్రాంతంలో వైద్య పరీక్షలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డాక్టరు అగర్వాల్ ఆస్పత్రి యాజమాన్యానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ములగాడ : విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న అగర్వాల్ ఆసుపత్రి సిబ్బంది

నేరాలు ఘోరాలు

2 పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి శాంతిగిరి కాలనీలో శనివారం సాయంత్రం విద్యుత్ షార్టుసర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. డోర్ నెంబర్ 65-4-428/1/7లో పైల వరహాలమ్మ, సత్యబాబు దంపతులు, డోర్ నెంబర్ 65-4-428/1/6లో గురు సూర్యవతి, రమణ దంపతుల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎప్పటిలాగానే శనివారం ఆయా కుటుంబాలు కూలి పనులకు వెళ్లిపోయాయి. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ ఇళ్లలో మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, స్థానిక కార్పొరేటర్‌కు సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. స్థానిక కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, పుర్రె సురేష్‌యాదవ్ అక్కడికి చేరుకొని సహకారం అందించారు. గాజువాక పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు.

విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు పని నుంచి పరుగున వచ్చిన కాలిన ఇళ్లను చూసి బోరున విలపించారు. పిల్లల చదువు కోసం రూ.లక్ష అప్పుచేసి తెచ్చి ఇంట్లో పెట్టామని, ఇంట్లో ఉన్న వస్తువులు, బంగారం, వెండి, ఇంటి కాగితాలు, పిల్లల సర్టిఫికెట్లు అన్నీ కాలి బూడిదయ్యాయని పైల వరహాలమ్మ, సత్యబాబు దంపతులు రోధిస్తున్నారు.

పలువురి పరామర్శ

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు శనివారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. అధికారుల నివేదిక ద్వారా కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని ధైర్యం చెప్పారు. విద్యుత్ సిబ్బందిని త్వరితగతిన రప్పించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ములగాడ తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, నక్క లక్ష్మణరావు, రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను సిపిఎం నాయకులు పరామర్శించారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని బాధిత కుటుంబాలకు వెంటనే ఆర్థిక సహాయం చేయాలని సిపిఎం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, బూడి శ్రీను, డి.రాజేష్, ప్రశాంత్ డిమాండ్‌చేశారు.

ఐదున్నరేళ్ల తర్వాత.. గంజాయి నిందితుడు పట్టివేత

ప్రజాశక్తి- ములగాడ : గంజాయి కేసులో నిందితుడు ఐదున్నరేళ్ల తర్వాత పోలీసులకు పట్టుబడ్డాడు. మల్కాపురం పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సిఐ గొలగాని అప్పారావు వివరాలను వెల్లడించారు. 2020 ఫిబ్రవరిలో కోరమాండల్ కర్మాగారంలో లారీ అన్‌లోడ్ చేస్తుండగా పెద్ద మొత్తంలో గంజాయి బయటపడింది. ఈ ఘటనపై అప్పట్లో మల్కాపురం పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుడు పరారయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పాత కేసులు త్వరతగతిన పూర్తి చేయాలని సిపి శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు సిఐ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో పోలీసులు ఒడిశాలో వారం రోజులు మాటువేశారు. సాంకేతికత సాయంతో నిందితుడు ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కంవాద పరిధి కరస్తాగూడ గ్రామానికి చెందిన బిజె కబాసీ (37)గా గుర్తించి పట్టుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రమాదవశాత్తు కాలు జారి ఒక వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని వారాడ గ్రామంలో చోటుచేసుకుంది. ఎ.కోడూరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... వారాడ గ్రామానికి చెందిన బొత్స ముత్యాలు (66) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 13వ తేదీన ఉదయం ముత్యాలు బహిర్భూమికి వెళ్లానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు చుట్టుపక్కల గ్రామాలన్నీ వెతికినా ముత్యాలు ఆచూకీ లభించలేదు. ఈ సమయంలో శనివారం వారాడ గ్రామ సమీపంలో ఉన్న రంగరాజు చెరువులో ముత్యాలు శవమై తేలి ఉండటాన్ని చుట్టుపక్కల వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు ముత్యాల భార్య ఇటీవల మృతి చెందారు. వారికి ఒక కుమారుడు కుమార్తెలు ఉన్నారు. మృతిని కుమారుడు బొత్స శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎ.కోడూరు ఎస్ఐ. ముకుంద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్ అందిస్తున్న గురునాథ్

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు జివిఎంసి ద్వారా వచ్చిన యూనీఫామ్‌ను శనివారం టిడిపి వార్డు అధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురునాథ్ మాట్లాడుతూ, 34 మందికి మహిళలకు చీరలు, జాకెట్లు, దుప్పట్లు, 36 మంది పురుషులకు యూనిఫాం, తువాళ్లు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాసరావు, గొల్లంగి ఆనందబాబు, రెడ్డి సత్యనారాయణ 6వ వార్డు జనసేన అధ్యక్షులు సంతోష్ నాయుడు, షేక్ షబానీ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో బాబూరావు, కెకె.రాజు తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 51వార్డు పరిధి మహత్ కాలనీలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఎస్‌సి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, విగ్రహ దాత ఎద్దు పైడిరాజు, అంబటి శైలేష్, ఎం.సునీల్, బోణి శివరామకృష్ణ, మంచ నాగమల్లీశ్వరి, తిరుమలరావు, రత్నం, ధర్మవతి, అప్పారావు మాస్టర్, శ్రీను, జెవి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశ మందిరం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేటలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన నిర్మించిన సమావేశ మందిరం, అతిథిగృహ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ప్రజల కోసం కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడం చాలా ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అధ్యక్షులు బోరా ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ, నమ్మి వెంకటయాదవ్, గొంప అప్పారావు, సానబోయిన సురేష్, గోవింద్, ఆవాల వెంకట, సారిపిల్లి సంతోష్, రాజారావు, నూకరాజు, రామకుమార్, సంతోష్, పాపారావు, శ్రీనివాసరావు, అప్పారావు, వీర్రాజు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

'విశ్వనాథ్'కు భవానీ ద్వీపంలో భూమి కేటాయింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్ర యూనివర్సిటీలో జరుగుతున్న సిఐఐ సమ్మెట్‌లో భాగంగా విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు విజయవాడ భవానీ ద్వీపంలో 10 ఎకరాలు కేటాయించినట్లు విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అధినేత బొడ్డేటి కాశీవిశ్వనాథం తెలిపారు. విశాఖలోని పోర్టు స్టేడియంలో మాదిరిగా థ్రిల్ సిటీగా భవాని ద్వీపాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు నరేంద్ర రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మిట్‌లో ఒప్పంద పత్రాలు అందుకుంటున్న 'విశ్వనాథ్' ప్రతినిధులు

ప్రమాద రహిత రాష్ట్రమే లక్ష్యం

మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆనందపురం : రాష్ట్రాన్ని ప్రమాద రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వాల ప్రధాన ధ్యేయమని రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆనందపురం మండలం గంభీరంలోని వాహన సామర్థ్య పరీక్ష కేంద్రం నిర్మాణ పనులను శనివారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించి సెన్సార్లు, కెమెరాల పనిచేసే విధానంపై అధికారులనడిగి తెలుసుకున్నారు. డ్రైవింగ్ నైపుణ్యాలను పరీక్షించుకునేందుకు వచ్చిన వాహనదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల్లో భాగంగా రాష్ట్రంలో వాహన సామర్థ్య పరీక్ష కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు.

18 నుండి 40 సంవత్సరాల మధ్య వయసు గలవారే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. మానవ తప్పిదం, కాలం చెల్లిన వాహనాల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. రవాణా శాఖ నిబంధనలను వాహనదారులు ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ డిటిసి ఆర్‌సి హెచ్.శ్రీనివాస్, ఇన్‌ఛార్జ్ ఆర్‌టిఒ రామ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాలరావు, బుచ్చిరాజు, బాలాజీరావు, అసిస్టెంట్ మోటార్స్ అధికారి ఎం.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గంభీరంలో ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బిపిఎస్ స్కీమ్‌ను సద్వినియోగపరచుకోవాలి


ప్రజాశక్తి-పెందుర్తి : ప్రజల కోసం ప్రభుత్వం విడుదల చేసిన బిల్డింగ్ పినలైజేషన్ స్కీమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రణాళిక సహాయ అధికారి రామలింగారెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనుమతి లేకుండా కట్టిన బిల్డింగ్‌లు, ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్న భవనాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్యలో కట్టిన భవనాలను మాత్రమే క్రమబద్ధీకరణ చేస్తారని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న భవనాలు, భూ తగాదాలకు కూడా ఈ స్కీమ్ వర్తిస్తుందని వివరించారు. దీనికి సంబంధించిన రిజిస్టర్ సేల్ డీడ్ కాపీ, ఇసి, మార్కెట్ వ్యాల్యూ, ప్లాన్ కాపీ సర్టిఫికెట్, బిల్డింగ్ ఫొటోలు, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్, ఇండెంట్ బాండ్ అప్‌లోడ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. ప్లాటు డివియేషన్ ల్యాండ్ ఆధారంగా చార్జీలు చెల్లించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసే సమయంలో ముందస్తు రూ.10 వేలు చెల్లింపు తప్పనిసరి అని తెలిపారు. పాత భవనాలకు 1997లోపు ఉన్నట్లయితే 25 శాతం తగ్గింపు, స్లమ్ ప్రాంతాలకు 50 శాతం తగ్గింపు వర్తిస్తుందని వివరించారు. నోటిఫికేషన్ వచ్చిన నుండి 120 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి- గాజువాక : వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కషి చేస్తానని 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి 76 వార్డు పరిధి స్వతంత్ర నగర్‌లో మరమత్తులుకు గురైన కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో వార్డును అన్ని విధాలా అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ భవనాలు ఉండేలా ఏర్పాటుచేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించామని తెలిపారు. వార్డు ముంపునకు గురికాకుండా ప్రధాన డ్రైనేజీలు చాలా వరకు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పలరాజు, సెక్రటరీ కూన వెంకట్రావు, శివ, రాజా, బొడ్డు సత్యారావు, బొడ్డు కృష్ణ, నాగు, శ్రీధర్, రామునాయుడు పాల్గొన్నారు.

టిడిపి 6వ వార్డు అధ్యక్షునిగా గరే గురునాథ్

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఆరో వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా కెవిఆర్ కేటరింగ్ అధినేత గరే గురునాథ్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా వరుపుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా లొడగల జానకిరామ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బన్నరావురి ప్రసాదరావు, పోతిన శ్రీనివాసరావు, నొడగల రామశేఖర్, కార్యదర్శులుగా తిరుమలరాజు వర్మ, అలాబని సూరిబాబు, గిడిజాల పార్వతీశం, కోశాధికారిగా కొరగంజి సూరిబాబులను పార్టీ నియమించింది. ఈ సందర్భంగా గరే గురునాథ్ మాట్లాడుతూ, ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, నారా లోకేష్‌కు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, గంట రవితేజకు, చిక్కాల విజయబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని గురునాథ్ చెప్పారు. ప్రజలకు, పార్టీకి మరింత సేవ చేసుకునే అవకాశం లభించిందన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. తనకు సహాయ సహకారాలు అందించిన వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదే సహాయ సహకారాలు ఇప్పుడు కూడా అందించి తన వెన్నంటే నిలవాలని కోరారు.



గురునాథ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా

గంభీరం పాఠశాలను సందర్శించిన హెల్త్ అండ్ హైజిన్ బృందం

ప్రజాశక్తి ఆనందపురం: గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను స్కూల్ హెల్త్ అండ్ హైజిన్ ప్రోగ్రామ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.మాధవి సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, అలవాట్లు తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన 'మా పాఠశాల వైద్య బృందం' కార్యకలాపాలను ఆమె సమీక్షించారు. విద్యార్థులు సమన్వయంతో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలను అభినందిస్తూ ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యువివి.ప్రసాద్, ఉపాధ్యాయులు లలితా దేవి, శివగంగ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక వినోద వల్లరి

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా క్రియేటివ్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన శనివారం పౌర గ్రంథాలయంలో 'ప్రత్యేక వినోద వల్లరి' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కృష్ణా యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ జి.జ్ఞానమణి, లీడర్ పత్రిక అధినేత వివి.రమణమూర్తి, ఎయు అడహాక్ ప్రొఫెసర్ ఉషా చీరాల హాజరై తమ సందేశాలను వినిపించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి విశ్రాంత అధికారి, నటులు బేతా రామసూర్య ప్రకాశరావును సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కొణతాల సురేష్ సినీ భక్తి గీతాలు, టి.లక్ష్మీప్రసాద్ పేరడి గీతాలు, వి.రామ్‌కుమార్ హిందీ గీతాలతో అలరించారు. మేడా మస్తాన్‌రెడ్డి, సుప్రియ చేసిన రేలంగి-రాజసులోచన సినీ హాస్య గీత నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విశాఖ హ్యూమర్ క్లబ్, క్రియేటివ్ కామెడి క్లబ్, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, లాఫ్టర్ ఫన్ క్లబ్, హాస్యప్రియ కామెడీ క్లబ్, హాస్య దర్బార్ సభ్యులు ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. కొణతాల రాజు స్వాగతం పలకగా, ఎం.సాయి సుప్రియ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పంతుల లలిత పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 30వ వార్డుకు చెందిన వైసిపి నాయకులు కోరిపల్లి ఆనంద్ ఆధ్వర్యాన 100 మంది శనివారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమోంలో జనసేన పార్టీలో చేరారు. సాలిపేటకు చెందిన ఎల్.రాజు, జనార్దన్, వినయ్, అప్పలరాజు, యేసు, నాగరాజు, ఎంవిఎస్ఎన్.మూర్తి, పి.కృష్ణ, రాజేష్, కిరణ్, ఈశ్వరరావు, లక్ష్మి, మంగవేణి, త్రివేణి, యువకులు చేరారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన 30వ వార్డు అధ్యక్షులు యజ్ఞశ్రీ, నాయకులు జన, వినయ్, శంకర్ పాల్గొన్నారు.

బ్లడ్ కేన్సర్ రోగికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- వేపగుంట : బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న వేపగుంటకు చెందిన మోక్షిత (10)కు శ్రీ వరహా లక్ష్మీనరసింహ స్వామి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. అసోసియేషన్ సభ్యులు సమకూర్చిన రూ.13,500ను కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ద్వారా బాలిక తల్లిదండ్రులకు అందజేశారు.

బ్రాండిక్స్‌లో కేంద్ర మంత్రి గోయల్ పర్యటన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం స్థానిక బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీని సందర్శించారు. ఇక్కడ వివిధ వస్త్ర పరిశ్రమలలో దుస్తుల తయారీ విధానాన్ని పరిశీలించారు. తయారైన దుస్తులు ఏయే దేశాలకు ఎగుమతి అవుతున్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్మాగారంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. బ్రాండిక్స్ సంస్థ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను వారి ద్వారా తెలుసుకున్నారు. బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి సంస్థ కార్యకలాపాలను మంత్రికి వివరించారు. గ్రామీణ మహిళలకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు, వస్త్రాల తయారీ, ఎగుమతి విధానాలు, ఉద్యోగులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవా కార్యక్రమాలను తెలియజేశారు. 20వేలకు పైగా గ్రామీణ మహిళలకు శిక్షణ ఇచ్చి, ఒకే చోట అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వాతావరణంలో ఉపాధి కల్పించినట్లు తెలిపారు. బ్రాండిక్స్ పనితీరును మంత్రి పీయూష్ గోయల్ ప్రశంసించారు. ఈ పరిశ్రమల్లో ఉత్పత్తులు ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో ఉన్నాయని అభినందించారు. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల పురోగతికి బ్రాండిక్స్ వంటి పరిశ్రమలు అధిక సంఖ్యలో ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ట్రంప్ అదనపు టారిఫ్‌ల కారణంగా తమ సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను దొరస్వామి కేంద్ర మంత్రికి విన్నవించారు. బ్రాండిక్స్ ఇండియా తమ ఎగుమతుల్లో 80 శాతం అమెరికాపైనే ఆధారపడి వుండటంతో, ఈ టారిఫ్‌ల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. వర్క్ ఆర్డర్‌లు లేకపోవడం వల్ల నష్టాలు తలెత్తుతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరపున వివిధ అంశాల్లో తమ సంస్థకు సహకారం కావాలని కేంద్ర మంత్రిని కోరారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక ఎంపీ సిఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, వాణిజ్య, పరిశ్రమల శాఖ ఉన్నతాధికార్లు, బ్రాండిక్స్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్రాండిక్స్ కంపెనీ కార్మికులకు అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి గోయల్

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-చోడవరం : రైతాంగం సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అల్లం మాధవి రామప్పరావు అధ్యక్షతన సాధారణ సమావేశం శనివారం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల సహకార సహకారాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. అనంతరం అక్టోబర్ నెల ఆదాయ వ్యయాలను అనుసరించి బడ్జెట్‌ను రూపొందించారు. త్వరలోనే రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్కెట్ కమిటీల లావాదేవీలు పునరుద్ధరిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్, సభ్యులు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగింపుపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పాయకరావుపేట : పట్టణంలోని పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌కు ఎదురుగా లే అవుట్ వేసిన భూమి యజమాని విశాఖపట్నంకు చెందిన కనుమూరి నర్సింహరాజు, గతంలో పాయకరావుపేట పంచాయతీకి కేటాయించిన స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించగా, ఆయనపై డిప్యూటీ ఎంపిడిఒ, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కుంచే డేవిడ్ స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. దాదాపు 5.5 కోట్లు విలువ చేసే ఈ పంచాయతీ స్థలాన్ని విశాఖపట్నంకు చెందిన కనుమూరి నర్సింహ రాజు ఆక్రమించగా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు గత నెల 30న డిప్యూటీ ఎంపిడిఒ డేవిడ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ హెచ్చరిక బోర్డును నర్సింహ రాజు తొలగించగా, విషయం పట్టణానికి చెందిన ఇంజరపు నరసింహ మూర్తి, ఇంజరపు సూరిబాబు డిప్యూటీ ఎంపిడిఒ డేవిడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి ఈ హెచ్చరిక బోర్డును తొలగించిన కనుమూరి నర్సింహ రాజుపై తగు చర్యలు నిమిత్తం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెరువులో పడి ఎద్దు మృతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పెదమదీన గ్రామంలో ఎద్దు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. గ్రామానికి చెందిన ఎలిశెట్టి వరహాలు శనివారం పిల్లి మెట్ట వద్దకు ఎద్దులను మేతకు తోలికెళ్లాడు. అక్కడ సమీపంలో చెరువు గట్టు వద్ద మేత మేస్తూ ఒక ఎద్దు కాలు జారి చెరువులో పడిపోయింది. గాయాలు కావడంతో నీటిలో మునిగి చనిపోయింది. ఒక ఎద్దు మరణించడంతో తాను ఉపాధి కోల్పోయానని బాధితుడు వాపోయాడు. మృతి చెందిన ఎద్దు ఖరీదు లక్ష రూపాయలని బాధితుడు తెలిపాడు. తమను ఆదుకోవాలని కోరాడు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనంగి గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ లైన్మెన్ నాగ అప్పలనాయుడు, లోవకుమారి దంపతులు శ్రీఅభయ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం రూ.10,116 విరాళం శనివారం అందజేశారు. ఈ మేరకు వారికి ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామ గోవిందరావు, ప్రధాన అర్చకులు హరికృష్ణ ఆచార్యులు, కమిటీ సభ్యులు సత్యనారాయణ, శేఖర్, ధనరాజు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మేజర్ పంచాయతీలోని పూసర్లవీధిలో కూనిశెట్టి వారి శ్రీగౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్య నారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, తాకాశీ కృష్ణ, వార్డు మెంబెర్ జగన్నాధం, రెడ్డి త్రినాథ్, వేగి సాయి పాల్గొన్నారు.

క్రీడా మైదానం బురదమయం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని శ్రీగురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానమే పట్టణ ప్రజలకు ఉన్న ఏకైక క్రీడామైదానం. ఇక్కడి హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఇక్కడి హాకీకి దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. అటువంటి హాకీకి ఆధారమైన క్రీడా మైదానం నేడు నీరు నిల్వ ఉండి బురదమయంగా ఉంది. మొంథా తుఫాన్ వచ్చి 15 రోజులైనా ఇప్పటికీ సగం మైదానం బురద నీటితో నిండి పశువులు దొర్లుతున్నాయి. ఈ మైదానంలో ఆటలకు మాత్రమే కాకుండా ఉదయం, సాయంత్రం ఎంతోమంది యువకులు, వృద్ధులు నడక, పరుగు, వ్యాయామం చేస్తూ ఉంటారు. మైదానం బురదతో ఉండటం వలన వారికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం, మున్సిపాలిటీ వారు స్పందించి మైదానంలో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, మైదానాన్ని శుభ్రంగా అరెట్లు ఏర్పాటు చేయాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.



గ్రౌండ్‌లో నీరు నిల్వ ఉండడంతో బురదగా ఉన్న దృశ్యం

సుద్ద కొండను తవ్వొద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో ప్లకార్డులతో నిరసన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బెన్నవోలు గ్రామస్తులు

ప్రజాశక్తి-చోడవరం : తమ గ్రామంలో ఉన్న సుద్దకొండలో తవ్వకాలు చేపట్టరాదని మండలంలోని బెన్నవోలు గ్రామస్తులు స్పష్టం చేశారు. బెన్నవోలు గ్రామంలో సర్వేనెంబర్ 157లో సుద్దకొండ నుండి 3,60,000 టన్నుల సుద్దను తవ్వుకునేందుకు లక్ష్మీ నరసింహ మెటల్ అండ్ సాండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏడాది పాటు కాంట్రాక్టు కుదుర్చుకుంది. దీనిపై గ్రామంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఆర్డీవో షేక్ హయేషా ఆధ్వర్యాన జరిగిన ఈ సభలో తవ్వకాలను వ్యతిరేకిస్తున్న స్థానికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. సుద్దను తరలించరాదని నిరసన వ్యక్తం చేశారు. మరి కొంతమంది తమకు ఉపాధి కల్పించి, తమ గ్రామానికి ఆదాయం వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎ.రామారావు, సీఐ అప్పలరాజు పాల్గొన్నారు.

సృజనాత్మకత కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట : విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన దృక్పథం కలిగి ఉండాలని ఢిల్లీ ఐఐటి ప్రొఫెసర్ పిఎమ్‌వి.సుబ్బారావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. తెలుసుకోవాలనే ఉత్సుకత, నేర్చుకోవాలనే ఆసక్తి ఈ రెండూ విద్యార్థులు సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదగడానికి కావలసిన సాధనాలని పేర్కొన్నారు. చదువుకొనే వయస్సులోనే జిజ్ఞాస, విశ్లేషణాత్మక దృష్టి కలిగి ఉండాలని, ఆసక్తితోనే ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, ఆవిష్కరణ అద్భుతాలకు దారి తీస్తుందని చెప్పారు. విద్యార్థులు పరిశీలనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, వారి పరిశీలన నుంచి వచ్చే ప్రతీ ఆలోచన సమాజం, పర్యావరణ సంక్షేమం కోసం ఉండాలని సూచించారు. శాస్త్రీయ, ప్రాథమిక అంశాల పట్ల స్పష్టత, పఠన విశ్లేషణ, వివరణాత్మకమైన అవగాహన అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్బారావు

గ్రామానికి దూరంగా పంచాయతీ భవనం సరికాదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గ్రామానికి దూరంగా నూతన పంచాయితీ భవనం నిర్మాణం సరికాదని మండలంలోని కరక గ్రామానికి చెందిన పలువురు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కరక గ్రామంలో నూతన పంచాయతీ భవనం నిర్మించేందుకు రెవెన్యూ కార్యదర్శి రాము, సర్వేయర్ జగన్ శనివారం స్థల సేకరణ చేపట్టారు. వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. పూర్వ కాలం నుండి తమ సాగులో ఉన్న భూమి ఇప్పుడు తీసుకోవడం సరికాదన్నారు. పంచాయతీ భవన నిర్మాణానికి సేకరించే స్థలం సమీపంలోనే స్మశాన వాటిక ఉందని, ఇక్కడ నిర్మిస్తే ప్రజలకు అందుబాటులో ఉండదని స్పష్టం చేశారు. గ్రామానికి దగ్గరలో ఉంటే ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. గ్రామంలో పలు ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని, వాటిలో నూతన పంచాయతీ భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యన్నంశెట్టి నాయుడు, బొబ్బది రామకృష్ణ, యన్నంశెట్టి రాజు, యన్నంశెట్టి సాయి, యన్నం శెట్టి సంతోషి, దమ్ము కాసు, దమ్ము సత్తిబాబు, వై.రాము, డి.లక్ష్మణ్, వై.చంద్రరావు పాల్గొన్నారు.

గరుత్మంతుని విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : స్థానిక వెంకటేశ్వర స్వామి గుడికి సమీపంలో నూతనంగా నిర్మించిన గరుత్మంతుని విగ్రహాన్ని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు దొంకన అప్పలనాయుడు, కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, సుంకర శ్రీను, శనివాడ శ్రీను, పూడి రామారావు అడ్డూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అరిపాకలోని గణపతి మారుతి దత్తాత్రేయ సహిత శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 15వ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్త మళ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, బిజెపి నేత చొక్కాకుల వెంకటరావు, ఎంపిటిసి చొక్కాలు గోవింద్, టిడిపి నేత గండి వంశీదీప్ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళా కోలాట పోటీలను అదీప్ రాజ్ ప్రారంభించారు. ఇందులో 17 జట్లు పాల్గొనగా విజేతలకు ఆలయ ధర్మకర్త కోటేశ్వరరావు నగదు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం బాబా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, వైసిపి నాయకులు గండి రవికుమార్, కర్రి బాబు, సబ్బవరపు నారాయణమూర్తి, టీడీపీ నేతలు వి.రమేష్ రాజు, ఆదారి నాగరాజు పాల్గొన్నారు.

మురుగుకంపులో పశువుల ఆసుపత్రి రోడ్డు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ప్రధాన పశు వైద్య కేంద్రానికి వెళ్లే రోడ్డు మురుగునీటితో కంపుకొడుతోంది. ఇటీవల సంభవించి తుపాన్ వల్ల కురిసిన వర్షాల సమయంలో మురుగునీరుతో ఈ రోడ్డు ముంపునకు గురైంది. నాచుతో ఉన్న నీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో రోడ్డు మొత్తం నాచు పట్టింది. వర్షాలు తగ్గి రెండు వారాలైనా నేటికీ ఆ రోడ్డుపై మురుగును, నాచును తొలగించలేదు. దీంతో ఈ మార్గంలో పశువుల ఆసుపత్రికి రావడానికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుపై పేరుకుపోయిన మురుగును, నాచును తొలగించాలని, శాశ్వత పరిష్కారంగా రోడ్డు ఎత్తు పెంచాలని పశు రైతులు, జీవాల పెంపకందారులు కోరుతున్నారు.



రోడ్డుపై ఉన్న నాచుపట్టిన మురుగు


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి -గాజువాక రోడ్డులోని కల్కి బంకు వద్ద రోడ్డు ప్రమాదాలు నివారించడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి శనివారం అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వరాదని తల్లిదండ్రులకు హితవు పలికారు. పట్టుబడితే వాహన యజమానికి కూడా శిక్ష పడుతుందన్నారు. ఆటోలో విద్యార్థుల్ని లెక్కకు మించి ఎక్కించవద్దని హెచ్చరించారు. డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడితే తీవ్ర శిక్షలు పడతాయని స్పష్టం చేశారు. ఆటోలకు ఇరువైపులా బ్యాగులు ధరించి ప్రయాణాలు కొనసాగించడం ప్రమాదకరమని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణకు సర్వే

ప్రజాశక్తి-యలమంచిలి : జాతీయ రహదారి-16 ఆరు లైన్లకు విస్తరించేందుకు యలమంచిలి పట్టణం యర్రవరం బిపిసిఎల్ బంకు వద్ద భారతీయ జాతీయ రహదారి అథారిటీ వారు శనివారం సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా వాహనాలు బరువు, వేగం రికార్డు చేశారు. వాహనదారులు నుంచి ప్రస్తుత రహదారి గురించి అభిప్రాయం తెలుసుకున్నారు. వాహనాలు ఆపి సర్వే కార్యక్రమం నిర్వహించడం వల్ల అక్కడ రహదారిపై ప్రయాణం నెమ్మదించింది. ఈ కార్యక్రమంలో స్థానిక హైవే, పోలీస్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.


విభిన్న ప్రతిభావంతులతో మాట్లాడుతున్న రామకృష్ణ

భవిత కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జిల్లా సహిత విద్య సమన్వయకర్త రామకృష్ణ మండలంలోని భవిత కేంద్రాన్ని శనివారం సందర్శించి అక్కడ ఉన్న పిల్లలను కలిశారు. విద్యా స్థాయిలను తెలుసుకొని రికార్డ్స్, రిజిస్టర్స్‌ను పరిశీలించారు. గృహ ఆధార విద్యను అందుకుంటున్న ప్రత్యేక అవసరాల పిల్లల ఇంటి వద్దకు కూడా వెళ్లి వారి తల్లిదండ్రులతో పిల్లల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వారికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు పోలిరాజు, దేముడునాయుడు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -మునగపాక : ఉపాధి హామీ నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని మూలపేట గ్రామంలో శనివారం గ్రామసభ జరిగింది. 2026- 27 సంవత్సరానికి గాను పలు పనులకు గ్రామసభలో ఆమోదం తెలిపారు. ఏపీవో శివ మాట్లాడుతూ పని చేసే ప్రతి శ్రామికుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, టిడిపి నాయకులు ఆడారి జనార్దన్, గ్రామ పెద్దలు ఆడారి సత్యనారాయణ, కాండ్రేగుల నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఆడారి జ్యోతి, మేట్లు, శ్రామికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మూలపేట సర్పంచ్ గంగ అప్పలనాయుడు

ఘనంగా జన్ జాతీయ గౌరవ్ దివస్


నివాళులర్పిస్తున్న డిఆర్ఒ సత్యనారాయణరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జన్ జాతీయ గౌరవ్ దివస్ వేడుకలను అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు వంటి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన వర్గాల పురోభివృద్ధి, రక్షణ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారిణి జి.మంగవేణి, ఎలక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు వాసు నాయుడు, గిరిజన సంక్షేమ ఆశ్రయ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బావరాజు, రమేష్ మూర్తి, ఆంజనేయులు, గిరిజన సంక్షేమ వసతి గృహాల అధికారులు శివ, మల్లేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి

మాడుగుల : మండలంలోని శంకరం పంచాయతీ గోప్పురు వద్ద ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి ఆధ్వర్యాన బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీలకు హక్కుల కోసం బిర్సా ముండా పోరాడి నాడు సాధిస్తే నేడు బిజెపి, టిడిపి ప్రభుత్వాలు వాటిని కాలరాస్తూ కార్పొరేట్లకు అడవులను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు.గిరిజన గ్రామాలకు రోడ్డుసౌకర్యం కల్పించాలన్నారు. గెడ్డలపై బ్రిడ్జిలను నిర్మించాలని కోరారు. వర్షం వస్తే గెడ్డలు దాట లేక గర్భిణీలు, బాలింతలను డోలి కట్టి మోసుకు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకరం పంచాయతీ సర్పంచ్ సోలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కె.భవాని, సోలం.చంద్రశఖర్, గిన్నెపల్లి సన్యాసమ్మ, మహేష్, అప్పన్న, గిరిజనులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నేత, ఆదివాసీలు

చలి కాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : చలికాలం ప్రారంభమైన నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పూజ్య మేఘన, డాక్టర్ వనజ సూచించారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పులు శరీరాన్ని బలహీనపరచి శ్వాసకోశ సమస్యలు, న్యూమోనియా వంటి వ్యాధులకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లల్లో న్యూమోనియా ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, తల్లిదండ్రులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఉన్నిదుస్తులు, పూలెన్ క్యాప్, సాక్స్‌లు తప్పనిసరిగా వేయాలన్నారు. కాచిన నీళ్లను మాత్రమే తాగాలని, వేడి, తాజా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. శరీర ఉష్ణోగ్రత తగ్గడం వలన మోకాళ్లు, నడుం నొప్పులు, శ్వాస సమస్యలు మరింతగా పెరిగే అవకాశం ఉండటంతో వృద్ధులు ఇంట్లోనే ఉండి శరీరాన్ని వేడి ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. స్కూల్‌కు వెళ్లే పిల్లలకు వేడి పాలు, వేడి అల్పాహారం ఇవ్వడం పిల్లల రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెప్పారు. దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బంది, ఛాతిలో బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాంతి స్థాపనపై పట్టణంలో ఉన్న పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు 9 మందికి కన్సోలేషన్ బహుమతులను స్థానిక గాంధీ నగరం లయన్స్ క్లబ్ భవనంలో అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా గుణశేఖర్, భాగ్య, యశస్విని గెలుచుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షు, కార్యదర్శులు డాక్టర్ ఎం రాకేష్, రత్నాజీరావు, కోశాధికారి బివి గున్నాజీ రావు, ప్రోగ్రాం చైర్మన్ వి కాశీపతి, అడిషనల్ సెక్రటరీ ఎరుబండి సత్యనారాయణ, పిళ్ల హర శ్రీనివాసరావు, వంకాయల ఈశ్వరరావు, వంకాయల శంకర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


చేతులు శుభ్రంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-వడ్డాది : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రతి ఒకరు ఆరోగ్యంగా ఉండవచ్చని ఎండిఓ శివప్రసాద్ నారాయణ అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంద్రలో భాగంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెజిబివి స్కూల్లో పరిశుభ్రతపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజనం చేసే ముందు భోజనం చేసిన తర్వాత చేతుల్ని పరిశుభ్రంగా కడగాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో లోవరాజు, ఎస్ఎంసి చైర్మన్ కృష్ణవేణి, నాయకులు ఎడ్ల రామ్మూర్తి, కెజిబివి ఇన్చార్జి ప్రిన్సిపల్ సంసద్ బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపిడివో బి చైతన్య, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు అన్నారు. మండలంలో ఉపమాక గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చేతులు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయ ప్రకాష్, వి.ఆర్.పి శ్రీను పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ చైతన్య


విద్యార్థులతో డైట్ చైర్మన్ రత్నాకర్

భాగస్వామ్య సదస్సులో డైట్ విద్యార్థుల సేవలు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నంలో జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సులో అనకాపల్లి డైట్ కళాశాల నుండి 75 మంది విద్యార్థులు వాలంటీర్లుగా సేవలు అందిస్తున్నారు. అత్యంత క్రమశిక్షణ, సమర్థతతో తమ సేవలను అందించారు. వీరు రిజిస్ట్రేషన్ డెస్క్, కాన్ఫరెన్స్ హాల్ మేనేజ్మెంట్, అంతర్జాతీయ ప్రతినిధుల రవాణా వ్యవస్థ, నివాస వ్యవస్థ, సమన్వయ పనులు వంటి అనేక బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించారు. ఈ సందర్భంగా సిఐఐ చైర్మన్ రాజీవ్ డైట్ కళాశాల విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు విద్యార్థి దశ నుండే ఇటువంటి వాలంటీరింగ్ కార్యక్రమాలకు ప్రోత్సహిస్తామని తెలిపారు తద్వారా విద్యార్థులకు ఆర్గనైజింగ్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు విద్యార్థులను అభినందించారు.

అన్ని సచివాలయాల్లో సదరం సర్టిఫికెట్లు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గంలోని వికలాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం అన్ని సచివాలయాల్లోనూ ఏర్పాట్లు చేయడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వికలాంగులంతా వినియోగించుకోవాలని సూచించారు. ఏ సచివాలంలోనైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే క్యాంపు కార్యాలయం నెంబరు 9885996699ను సంప్రదిస్తే సత్వరమే తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం : పార్టీలో సంస్థకతంగా ఎన్నికైన వారు వైసిపి బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, వైసిపి చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ అన్నారు. నియోజకవర్గంలో పార్టీ పదవులకు నియామకమైన వారిని శనివారం ఆయన సన్మానించారు. వైసిపి చోడవరం మండల అధ్యక్షునిగా శరగడం సిమ్మి నాయుడు, చోడవరం పట్టణ అధ్యక్షునిగా దేవరపల్లి వీర వెంకట సత్యనారాయణ, పట్టణ యూత్ అధ్యక్షునిగా గునూరు రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా గాడి అప్పారావు, మండల యూత్ అధ్యక్షునిగా పల్లా ధనాజీ, రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శిగా గూనూరు రామచంద్ర నాయుడును నియమించారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని సంపద తయారీ కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులు సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారి మంజుల వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టాల్సిన కాల్వలు, చెరువులు, గ్రామీణ రహదారులను గుర్తించి, సంబంధిత శాఖలకు దిశానిర్దేశాలు జారీ చేశారు. తదనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణ రాజు, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి అనంతఉమాదేవి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో శనివారం ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక అంశాలపై అవగాహన పెంపుదల అవసరాన్ని ఆయన వివరించారు. చెడు ప్రభావాలకు లోనుకాకుండా, వ్యక్తిగత లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో ముందుకు సాగితేనే సమాజానికి బాధ్యతాయుత పౌరులుగా ఎదగగలరని ఎస్సై పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ



మినరల్ మిక్సర్ ప్యాకెట్లు ఇస్తున్న వైద్యాధికారులు,

పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో చందనాడ గ్రామంలో శనివారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక సహాయంతో, ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ముందుగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నల్లల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పశుగణాబివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ మాణిక్యం వీర్రాజు, జానకయ్య పేట పశువైద్యాధికారో సాయి కిరణ్ లు మాట్లాడారు. పశు పోషణ, సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. మేలు జాతి పాడి పశువుల పెంపకంతో వచ్చే లాభాలు గురించి వివరించారు. పాడిపశువులకు వైద్య పరీక్షలు చేశారు. రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తిరుపతిరావు, తళ్ల భార్గవ్, వేతన కార్యదర్శి బాబ్జి,తళ్ల అప్పల స్వామి, పెదకాపు, గోవింద్, పశువైద్యాధికారులు భరత్ కుమార్, వంశీకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

హోం మంత్రి అనిత చొరవతో..

సంతలో షెడ్డుల నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండల కేంద్రంలో వారపు సంతలో హెూం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చొరవతో సిఎస్ఆర్ నిధుల నుండి షెడ్డులు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి శుక్రవారం నక్కపల్లిలో వారపు సంత జరుగుతుంది. పలు ప్రాంతాల నుండి వచ్చిన చిరు వ్యాపారులు తాటాకులతో చిన్న చిన్న పాకలు వేసుకుని కూరగాయలు విక్రయిస్తూ ఉంటారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సంతలో పాకలన్నీ ఖాళీ బూడిదయ్యాయి. దీంతో చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. చిరు వ్యాపారులందరూ స్థానిక అధికారులు, నాయకులను కలిసి సమస్యను విన్నవించారు. దీంతో, సమస్యను హెూంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు హెూం మంత్రి కలెక్టర్‌తో కలిసి మార్కెట్‌లో కాలిపోయిన పాకలను పరిశీలించారు. హెూంమంత్రి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ప్రతిపాదన మేరకు హెటిరో డ్రగ్స్, డెక్కన్ కంపెనీల సిఎస్ఆర్ నిధులు నుండి 50 లక్షల వ్యయంతో రెండు షెడ్డులు (60 షాపులతో) నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసారు. పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, వైస్ ఎంపిపి వీసం నానాజీ, పంచాయతీ ఉప సర్పంచ్ వీసం రాజు, మార్కెట్ నిర్వాహకులు దేవవరపు కొండలరావు, కొప్పిశెట్టి కొండబాబు, శ్రీను, టిడిపి నాయకులు అప్పలరాజు, రాఘవ, లోవరాజు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు



ర్యాలీని ప్రారంభిస్తున్న విజయ్

డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపాలి

- టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ప్రజాశక్తి -నర్సీపట్నం:డ్రగ్స్ నివారణపై పోలీసులు చేపడుతున్న సైకిల్ ర్యాలీ నర్సీపట్నం చేరుకుంది. టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఏ.ఎస్.పి దేవి ప్రసాద్ సైకిల్ ర్యాలీ బృందానికి స్వాగతం పలికారు.ఈ సందర్భంలో విజయ్ మాట్లాడుతూ,సమాజానికి అత్యంత హానికరంగా మారిన డ్రగ్స్ వాడకాన్ని నిర్మూలించేందుకు కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు.
ఎఎస్‌పి దేవి ప్రసాద్ మాట్లాడుతూ, నేరాలపై 100కి ఫోన్ చేసి నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి సూర్యచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్, తహసిల్దార్ రామారావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటరమణ, కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రుత్తల కృష్ణ పాల్గొన్నారు.

తోలు బొమ్మలాట సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోలుబొమ్మల ఆట శిక్షణ, తయారీపై సర్టిఫికెట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన ప్రముఖ తోలుబొమ్మల ఆట కళాకారులు కే.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ప్రాచీన కళారూపమైన తోలుబొమ్మల ఆటను నేటి తరానికి పరిచయం చేసి, దాని వైభవాన్ని సంరక్షించాలని ఉన్నత ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఐ.రవీంద్ర నాయక్, జగత్‌రాయ్, ఈశ్వరరావు, పూర్ణారావు, శ్రీనివాసరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-రావికమతం: చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశాల మేరకు గుడ్డిప పంచాయతీ శివారు గధబపాలెం గ్రామాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ భగవంతురావు శనివారం సందర్శించారు. మంచి నీటి సదుపాయాన్ని కల్పించాలని ఇటీవల ఆ గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామిను గ్రామ ప్రజలందరూ కోరారు. ఈ మేరకు జె.ఇ గ్రామంలో కొలతలు తీసుకుని ఎస్టిమేట్ వేశారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి త్రాగునీటి సరఫరాను అందించడం జరుగుతుందని జెఇ తెలిపారు ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీను, మాజీ సర్పంచ్ గల్లా సత్యారావు, కూటమి నాయకులు మజ్జి అప్పారావు, (కొండయ్య) మేలాసి పెద్ద నాయుడు, పంచాయతీ కార్యదర్శి నరసింగరావు, స్వామి, నాని బాబు పాల్గొన్నారు.



నీటిని పరిశీలిస్తున్న జెఇ


వైసిపిలో పలు విభాగాలకు కమిటీల ఎన్నిక

గ్రామ శాఖ అధ్యక్షునిగా గంగరాజు



ప్రజాశక్తి- రావికమతం:మండలంలో మరుపాక గ్రామ పంచాయతీ వైఎస్ఆర్సిపి గ్రామ శాఖ అధ్యక్షునిగా జెర్రిపోతుల గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అందరూ ఆయనను అభినందించారు.

మండల పార్టీ అధ్యక్షునిగా జగన్నాధరావు



రావికమతం: వైఎస్ఆర్సిపి రావికమతం మండల పార్టీ అధ్యక్షునిగా కంచిపాటి జగన్నాధరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షునిగా, మండల కన్వీనర్‌గా, మండల అగ్రికల్చర్ అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా గతంలో పని చేశారు. వైఎస్ఆర్సిపి గ్రామ పార్టీ అధ్యక్షురాలు దాసరి సూర్యకుమారి, గుమ్మాలపాడు సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, ప్రసాదు, రవికుమార్‌లు అభినందించారు.

రైతు విభాగం అధ్యక్షునిగా సన్యాసినాయుడు



రావికమతం:చోడవరం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షునిగా రావికమతం మండలం గుమ్మాలపాడు సర్పంచ్ బంటు సన్యాసినాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురు పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నర్సీపట్నం: స్థానిక గ్రంథాలయ అధికారిని దమయంతి విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం పై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నర్సీపట్నం:గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలని స్పీకర్ సతీమణి, మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి కోరారు. గ్రంథాలయ శాఖ పూర్వ అధికారి త్రిమూర్తులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ పద్మావతి శాఖ గ్రంథాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు, ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, గ్రంథాలయానికి సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు హామీ ఇచ్చారు. గ్రంథాలయానికి వంద పుస్తకాలను విరాళంగా అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తలుపులు, గ్రంధాలయ అధికారి దమయంతి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల:మాడుగుల, కెజె.పురం గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ సూర్యారావు, పంచాయతీ కార్యదర్శి నాయుడు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అనకాపల్లి : స్థానిక శాఖవీధి ప్రభుత్వ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సిద్దార్ధ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రోగ్రామ్ చైర్మన్ బల్లా నాగభూషణం పాల్గొన్నారు.

కోటవురట్ల : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు విద్యార్థులకు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూను పోటీలు నిర్వహించారు. పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను గల్లా రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉల్లంగల రమేష్, కర్రి గోవిందా, గాయత్రి పాఠశాల ఉపాధ్యాయురాలు పి.సాయిస్వాతి, గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

కె.కోటపాడు:మండలంలోని చౌడువాడ శాఖాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ అధికారి ఎం.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో రెండో రోజు పుస్తక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. రిటైర్డ్ లెక్చరర్ కె.గోపికృష్ణ, ఆడారి పూరీజగన్నాథ్, గ్రంథాలయాధికారి వి.ఆనంద్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంథాలయ అధికారి కృష్ణారావు నిర్వహించారు

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఎంఈఓ-1 ఎస్.లక్ష్మణరావు అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ అధికారి వి.శిరీష, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పిపి సిహెచ్ వరప్రసాద్, బ్రిడ్జి ట్రైన్స్ స్కూల్ టీచర్ విజయ ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక గ్రంథాలయంలో శనివారం శ్రీచైతన్య స్కూల్ జూనియర్స్ విద్యార్థులకు క్విజ్, శ్రీప్రకాష్ విద్యా నికేతన్, హైస్కూల్ విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. , గ్రంథాలయ ఇంఛార్జి వామాల లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్చుతాపురం శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన గ్రంథాలయ అధికారి ఎల్‌వి.రమణ నిర్వహించారు. ఉపాధ్యాయులు వై.బంగారు రాజు పాఠకులు నరేంద్ర, శివకృష్ణ, హరి పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రముఖ రచయిత ప్రేమ్ చంద్ రచనలు గ్రామీణ భారతానికి అద్దం పట్టేలా ఉంటాయని ప్రముఖ కవి జి.పెంటాద్రిరావు అన్నారు. తుమ్మపాల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పద్మావతి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఆళ్ల గోవిందరావు గ్రంథాలయాల ప్రాధాన్యతను గుర్తుచేశారు.

గాజువాక : గాజువాక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు టి.శ్రీరామమూర్తి ప్రారంభించారు. జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ, పుస్తకాలు చదువుట వలన విజ్ఞానం వికసిస్తుందన్నారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పాల్గొన్నారు. పెదగంట్యాడ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గ్రంథాలయాధికారి రమణ, పాఠకులు మహేష్, రాంబాబు, అభయ్, కార్తీక్, మహేష్, నవ్య, జ్యోతి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. గ్రంథాలయాధికారి మహేష్, ఎపి పింఛనుదారుల సంక్షేమ సంఘం భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు టి.భీమారావు, డి.ఈశ్వరరావు, కె.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో సాహిత్య సమ్మేళనం నిర్వహించారు. కవిత్వం రూపంలో విశాఖ ఉమ్మడి జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.కుమార్‌రాజు వివరించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, కవులు రెడ్డి రామకృష్ణ, కోరాడ నరసింహారావు, కెవిఎస్.నరసింహ పాల్గొన్నారు.

తగరపువలస : అవంతి ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయంలో పుస్త ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, మహేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



వెంకన్నను దర్శించుకుంటున్న పార్థసారధి రెడ్డి, డైరెక్టర్లు

ఉపమాకకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కార్తీక మాసం బహుళ ఏకాదశి శనివారం కావడంతో పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు, విద్యార్థులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కార్తీక శోభ సంతరించుకుంది. వెంకన్న మూల విరాట్ ను, కొండ దిగువున ఉపాలయాల్లో వెంకన్న ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించుకున్నారు. హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి, డైరెక్టర్లు సాంబిరెడ్డి, మోహన్ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోటవురట్ల గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు వెంకన్న ఆలయాన్ని సందర్శించారు.

17 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు గొలుగొండ మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. 17, 18 తేదీల్లో కొత్తమల్లంపేట, 19న సీహెచ్.నాగాపురం, 20న కొంకసింగి, 21న కృష్ణదేవిపేట, 22, 24 తేదీల్లో ఏఎల్.పురం, 25న చోద్యం, 26న జోగుంపేటలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆధార్ అప్డేట్, కొత్త ఆధార్, బయోమెట్రిక్, పేర్లు, చిరుమానాల మార్పు తదితర వాటి కోసం ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు.

బల్క్ డ్రగ్‌పై పోరాటం ఆగదు

-కొనసాగిన మత్స్యకారుల రిలే దీక్షలు

ప్రజాశక్తి- నక్కపల్లి:బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 63వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. హెూం మంత్రి వంగలపూడి అనిత సూచన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ను కలిసేందుకు 52 మందితో కమిటీని ఏర్పాటు చేసి జాబితాను అధికారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో ఆందోళన శిబిరం వద్దకు వచ్చి కమిటీని వేసుకున్నారు కదా, ఆందోళన విరమించాలని చెబుతున్నారని, బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, పి.సత్తయ్య, పి.కోదండరావు, పి.తాతాజీ, యజ్జల అప్పలరాజు, సిహెచ్ వీరబాబు, పి.మాధవ, పి.పైడితల్లి, సిహెచ్ చిట్టమ్మ బి నూకమ్మ, వై కొర్లయమ్మ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

నరెడ్కో ప్రోపర్టీ షోకు విశేష స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:నరెడ్కో ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని గాదిరాజు ప్యాలస్‌లో నిర్వహిస్తున్న ప్రాపర్టీ ఫెస్ట్ - 2025 శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఒక వైపు సిఐఐ పెట్టుబడుల సదస్సు, మరోవైపు ప్రాపర్టీ షో జరుగుతుండడంతో పెట్టుబడుల సదస్సుకు వచ్చిన ఇన్వెస్టర్లు ప్రాపర్టీ షోను కూడా సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ చుట్టు పక్కల ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుండడంతో ప్రజలలో కూడా ఆసక్తి నెలకొని స్థిరాస్తులు కొనుగోలుకు ఆసక్తి కనబరచడంతో ప్రాపర్టీ షోకు భారీ స్పందన లభిస్తోందని నిర్వాహకులు చెబుతున్నారు. స్టాళ్ల వద్ద పెద్దఎత్తున సందడి కనిపించడంతో వారు ఆనందం వ్యక్తం చేసారు. ఈ ప్రాపర్టీ షోకు శనివారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, పి.గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహననాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలుచుకుంటున్నారని తెలిపారు. దూరదృష్టి, ఆలోచనలతో గత చిక్కుముడులన్నీ విప్పుకుంటూ కొత్త కొత్త అవకాశాలు వెతుకుతున్నారన్నారు. 17 నెలల కాలంలోనే అన్ని అడ్డంకులు అధిగమించి నేడు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని తెలిపారు. గూగుల్ వంటి సంస్థలు విశాఖకు తరలి రావడం చిన్న విషయం కాదన్నారు. దీనిరాకతో ఉత్తరాంధ్ర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయన్నారు. భోగాపురం విమానాశ్రయం అన్ని అడ్డంకులు దాటి శరవేగంగా నిర్మితమౌతోందన్నారు. బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో బిల్డింగ్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. సిఐఐ సమ్మిట్ విశేషాలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఉత్తరాంధ్ర పెట్టుబడిదారులు జియంఆర్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని మందుకెళ్లాలని, లేకపోతే వెనుకబడతారని హితవు పలికారు. నరెడ్కోలాంటి సంస్థ క్రెడిబులిటీ ఉన్న సంస్థ అని తెలిపారు. భవిష్యత్‌లో విశాఖలో అంతర్జాతీయ వాసులు కూడా నివాసాలు కొనుగోలు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, దానికి ధీటుగా నిర్మాణాలు ఉండాలని బిల్డర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నరెడ్కో ఉత్తరాంధ్ర అధ్యక్షులు రమేష్ బాబు, విశాఖ అధ్యక్షులు రాజశేఖర్, ప్రతినిధులు సుబ్బారావు, వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

రెండో రోజూ అదే సందడి

ముగిసిన సిఐఐ భాగస్వామ్య సదస్సు



అతిథులకు చీరలు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో పారిశ్రామికవేత్తల వాహనాలు



సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు



ఎపి పెవిలియన్ వద్ద పారిశ్రామిక వేత్తల సందడి



విశాఖ జిల్లా కలెక్టర్‌ను అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



కొమ్ము నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు



నృత్యం చేస్తున్న మహిళా కళాకారులు